# తెలంగాణ జలసిరిని ప్రజా ఉద్యమంగా మార్చుదాం






### ఇంటింటా ఇంకుడు గుంత.. పొలంపొలానికి పంట కుంట చింతపల్లి సమావేశంలో ప్రత్యేక అధికారి గోవిందయ్య పిలుపు

**చింతపల్లి, జూలై 28 జర్నలిస్ట్ డైరీ**

ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున "ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టడమే భావితరాల జల భద్రతకు అసలైన బాట" అని చింతపల్లి మండల ప్రత్యేక అధికారి గోవిందయ్య స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజల ఉద్యమంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. మంగళవారం మండల అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించిన జలసిరి అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "నీటిని ఆదా చేయడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు... ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత" అని అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న ప్రతి వర్షాన్ని భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకుంటేనే రానున్న తరాలకు తాగునీరు, సాగునీటి కొరత లేకుండా చేయగలమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలు ఇంటింటికీ వెళ్లి నీటి సంరక్షణపై ప్రజలకు చైతన్యం కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి గ్రామానికి ఊట కుంట ఏర్పాటు చేస్తే భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. గ్రామాల్లో నీటి పొదుపు, వర్షపు నీటి నిల్వపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జలసిరితో గ్రామాలకు జలకళవి.బి.జి., స్వచ్ఛ్ భారత్ మిషన్ పథకాల ద్వారా మ్యాజిక్ సోక్‌పిట్‌లు, కమ్యూనిటీ సోక్‌పిట్‌లు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు, భవనాలపై వర్షపు నీటి సేకరణ వ్యవస్థలు, పంట కుంటలు, వ్యవసాయ దిగుడు బావుల అభివృద్ధి వంటి పనులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని గోవిందయ్య తెలిపారు. గ్రామపంచాయతీలు, మహిళా సంఘాలు, రైతులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా పనిచేస్తే వర్షపు నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. చెరువులు, కుంటలు, కాలువలు, ఇంకుడు గుంతలను శుభ్రపరచి నీటి నిల్వకు అనుకూలంగా మార్చాలని, అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో జలసిరి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రజల్లో అవగాహన పెంచాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ విజయలక్ష్మి, మండల అభివృద్ధి అధికారి సుజాత, మండల వ్యవసాయ అధికారి శ్రావణ కుమారి, ఎంపీవో ఇందూజ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామాల వారీగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలంగాణ జలసిరిని విజయవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## జలసంచాయి-జలభాగిదారి 2.0 పనులపై ఢిల్లీ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన





### ట్రెంచ్ వర్క్‌ను పరిశీలించి సంతృప్తి మొదుగుల మల్లేపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: సర్పంచ్ మల్లేష్ గౌడ్

**చింతపల్లి, జూలై 28 జర్నలిస్ట్ డైరీ**

జల సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ అమలు చేస్తున్న జలసంచాయి--జలభాగిదారి 2.0 కార్యక్రమంలో భాగంగా చింతపల్లి మండలం మొదుగుల మల్లేపల్లి గ్రామంలో చేపట్టిన పనులను మంగళవారం ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర పరిశీలన బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. కార్యక్రమం అమలు తీరును నిశితంగా పరిశీలించిన అధికారులు చేపట్టిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఇన్‌స్పెక్షన్ అధికారి సంతోష్ ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన ట్రెంచ్ వర్క్‌లు, వర్షపు నీటి సంరక్షణ చర్యలు, భూగర్భ జలాల పెంపుదలకు చేపట్టిన పనులను పరిశీలించారు. గ్రామపంచాయతీ పరిధిలోని జోగుట్ట ప్రాంతంలో వర్షపు నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా నిర్మించిన ట్రెంచ్‌ల పనితీరును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, అమలు విధానంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. జలసంచాయి--జలభాగిదారి 2.0 కార్యక్రమం కింద చేపట్టిన పనులు లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయని, నీటి సంరక్షణకు ఇవి ఎంతగానో దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ముద్దం మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, వర్షపు నీటి వృథాను పూర్తిగా అరికట్టి గ్రామంలో జల వనరులను పెంపొందించడమే తమ లక్ష్యమని చెప్పారు. జలసంచాయి--జలభాగిదారి కార్యక్రమంలో గ్రామ ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న అభివృద్ధి పనులు మంచి ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. మొదుగుల మల్లేపల్లి గ్రామాన్ని నీటి సంరక్షణలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. పరిశీలనలో సి.ఈ., సి.టి.ఏ., పంచాయతీ కార్యదర్శి, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామంలో చేపట్టిన ట్రెంచ్ వర్క్‌ల నిర్వహణ, నాణ్యత, ప్రయోజనాలను అధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజల సహకారంతో నీటి సంరక్షణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తే భవిష్యత్ తరాలకు నీటి కొరత సమస్యను అధిగమించవచ్చని వారు పేర్కొన్నారు.

## ఆగస్టు 4న 'చలో బస్ భవన్'

### టీజీఎస్ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

**ఎల్బీనగర్, జూలై 28 జర్నలిస్ట్ డైరీ**

టీజీఎస్ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం, యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 4, 2026న నిర్వహించనున్న 'చలో బస్ భవన్' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగస్టు 4న జరిగే 'చలో బస్ భవన్' కార్యక్రమానికి విశ్రాంత ఉద్యోగులను పెద్ద ఎత్తున సమాయత్తం చేయడం, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఆర్‌పీఎస్-2017, 2021కు సంబంధించిన ఎరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. తార్నాక ఆసుపత్రిలో విశ్రాంత ఉద్యోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు రెండు నెలలకు సరిపడా మందులను ఒకేసారి అందించాలని కోరారు. అలాగే సూపర్ లగ్జరీ బస్సుల్లో విశ్రాంత ఉద్యోగ దంపతులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విశ్రాంత ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బుచ్చిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 4న చేపట్టనున్న 'చలో బస్ భవన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు ఎండీ ఖదీర్, ఎండీ సిద్దిక్, ఎండీ యూసుఫ్, ఎండీ హుస్సేన్, కె. సత్యం, కె.ఎన్. రెడ్డి, వీరస్వామితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

**- డాక్టర్ గుమ్మడి కిరణ్**



**కూకట్పల్లి (జులై 28) జర్నలిస్ట్ డైరీ..**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కూకట్పల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎర్ర యాకన్నకు, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన నాగుల అంజిబాబుకు గుమ్మడి రాజలింగం ఫౌండేషన్, శ్రేష్ట ఐ క్లినిక్ అధినేత డాక్టర్ గుమ్మడి కిరణ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గుమ్మడి కిరణ్ మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు సమాజానికి సేవ చేసే దిశగా ఎర్ర యాకన్న సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించాలని ఆకాంక్షించారు. జర్నలిజం రంగంలో ఎర్ర యాకన్న, నాగుల అంజిబాబు చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ కోశాధికారి, సీనియర్ జర్నలిస్ట్ పుట్టి నగేష్, అనిల్ కిషోర్, శివ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ పిఎస్ పరిధిలో అర్ధరాత్రి టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు..

**జర్నలిస్ట్ డైరీ:ఎల్బీనగర్**

అర్ధరాత్రి తర్వాత నిబంధనలకు విరుద్ధంగా టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నవ్యక్తిని ఎల్బీనగర్ పోలీస్లు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. ఎల్బీనగర్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్కు చెందిన రావతవత్ కిషన్ ఎల్బీనగర్లో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. పోలీస్లు ఇచ్చిన సమయం దాటి టిఫిన్ సెంటర్ నడుపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఈ మేరకు పోలీసులు సోమవారం రాత్రి సమయం దాటి టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న రామవత్ కిషన్ ను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్కు తరలించారు. ఈ మేరకు ఇన్స్పెక్టర్ వినోద్కుమార్ మాట్లాడుతూ అందరూ పోలీస్ నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



ఎల్బీనగర్ పోలీసులు అరెస్టు చేసిన టిఫిన్ సెంటర్ నిర్వాకుడు కిషన్

## ప్రముఖ సీనియర్ నటి పావలా శ్యామల కన్నుమూత

### రెడీ టూ సర్వ్ ఫ్రీ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో ప్రజల సందర్శనార్థం పార్థివదేహం రేపు వనస్థలిపురం స్థానిక స్మశానవాటికలో అంత్యక్రియలు

**వనస్థలిపురం, జూలై 28 జర్నలిస్ట్ డైరీ**

ప్రముఖ సీనియర్ సినీ నటి పావలా శ్యామల (75) గుండెపోటుతో కన్నుమూశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. నటి కరాటే కల్యాణి, 'మా' జనరల్ సెక్రటరీ రఘుబాబు తదితరులు పావలా శ్యామల పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆమె పార్థివదేహాన్ని వనస్థలిపురంలో సామాజిక కార్యకర్త పెద్ది శంకర్ నిర్వహిస్తున్న 'రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఫ్రీ ఓల్డ్ ఏజ్ హోమ్'కు తరలించారు. సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, బంధువులు, అభిమానులు, ప్రజలు నివాళులర్పించేందుకు జూలై 28 మధ్యాహ్నం 3 గంటల నుంచి జూలై 29 మధ్యాహ్నం 12 గంటల వరకు పార్థివదేహాన్ని అక్కడే ఉంచనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పావలా శ్యామల అంత్యక్రియలకు సంబంధించిన పూర్తి బాధ్యతలను రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఫ్రీ ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం వనస్థలిపురంలోని స్థానిక స్మశానవాటికలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మరింత సమాచారం కోసం పెద్ది శంకర్‌ను 9701295527 నంబర్‌లో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.



